PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

గురువారం 01-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :121 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం.. ఫిరంగులమై పేలుదాం: సీఎం రేవంత్



సిరిసిల్ల: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల.. ఉరిసిల్లగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి (=వఝుత్ష్ట తీవఽఽఎ) ధ్వజమెత్తారు. సిరిసిల్లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. " ప్రపంచంలోనే ధనిక కుటుంబంగా ఆనాడు నిజాం నవాబుకు పేరుంటే.. ఇవాళ కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని, సిరిసిల్ల ప్రజల ఓట్లను సొమ్ముగా మార్చుకుని రూ.వేల కోట్ల ఆస్తులు సంపాదించుకుని విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించారు.
కేటీఆర్‌ను అమెరికా నుంచి దిగుమతి చేసి సిరిసిల్ల ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. 2009 నుంచి 2026 వరకు ఆరుసార్లు ఇక్కడి ప్రజలు గెలిపించారు. అయినా.. ఎందుకు నేత కార్మికుల ఆత్మహత్యలు ఆపలేకపోయారు? గల్ఫ్‌కు వలసపోతున్న కార్మికులను ఎందుకు ఆపలేకపోయారు? మీ కుటుంబాలను ఆదుకోవడానికి అణాపైసా సాయం చేయలేదు. ఒక్క రోజైనా కేసీఆర్ కుటుంబం.. మీ గురించి ఆలోచన చేసిందా? సామాజిక సమస్యలకు నిలయంగా సిరిసిల్ల మారింది. కార్మికుల కన్నీళ్లు, సంఘాల ఆందోళనలకు నిలయంగా మారింది. సిరిసిల్ల సమస్యలకు నిలయంగా మారలేదు.. మార్చారు. సిరిసిల్ల అంటే సిరులకు నిలయం అని అర్థం. ధైర్యం, దైవం కలిసి.. వెలిసిన ప్రాంతం ఇది. సిరిసిల్ల ప్రజల వేలాది ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారు. మానేరు ఇసుక కొల్లగొట్టి కేటీఆర్, రవీందర్‌రావు, సంతోష్‌రావు రూ.వేల కోట్లు దోచుకున్నారు.

పేజి 2లో ▶

## అరేబియా సముద్రంలో రూ.3 వేల కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం

- ఐసీజీ--గుజరాత్ ఏటీఎస్ సంయుక్త ఆపరేషన్
- 526 కిలోల హెరాయిన్, మెథాంఫెటమైన్ పట్టివేత
- ఐదుగురు పాకిస్థానీయుల అరెస్టు



అరేబియా సముద్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠా భారీ కుట్రను భారత తీర రక్షక దళం (ఐసీజీ) భగ్నం చేసింది. గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)తో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో రూ.3 వేల కోట్లకుపైగా విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది.లక్షద్వీప్‌కు పశ్చిమంగా అరేబియా సముద్రంలో సెప్టెంబర్ 25న ఈ ఆపరేషన్ చేపట్టారు. ఇందులో హెరాయిన్, మెథాంఫెటమైన్ సహా సుమారు 526 కిలోల అత్యంత నాణ్యమైన మాదకద్రవ్యాలను అధికారులు పట్టుకున్నారు.

పేజి 2లో ▶




## నిమ్స్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌పై సస్పెన్షన్ వేటు

- అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసులో అరెస్టై కస్టడీలో ఉన్న నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్, అదనపు ప్రొఫెసర్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై సస్పెన్షన్ వేటు పడింది.

2లో

## గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం'

### వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష



వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి ఆరా తీశారు. వీబీ --జీ రామ్ జీ అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

పేజి 2లో ▶

## ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం కల్పించడం ఈసీ బాధ్యత: డిప్యూటీ సీఎం భట్టి



ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరగాలని, ఎన్నికల సంఘం పక్షపాత వైఖరిపై ప్రజల్లో అనుమానాలున్నాయని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్ఐఆర్‌పై ప్రజల్లో ఉన్న అనుమానాలను ఈసీ నివృత్తి చేయాలన్నారు. ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘం పారదర్శకంగా సమాధానం చెప్పాలన్నారు. వేలాది ఓట్ల తొలగింపు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందన్నారు.

పేజి 2లో ▶

## భారత నౌకాదళ వ్యూహాత్మక పాత్ర మరింత కీలకం

- నౌకాదళ కమాండర్ల సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఆధునిక యుద్ధంలో సాంకేతిక పరివర్తన, సమాచార భాగస్వామ్యం అవసరం:



2లో

## చికిత తానిపర్తి అభినందనలు తెల్పిన సీఎం రేవంత్ రెడ్డి





జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడమే కాకుండా 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరగబోయే ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి అర్హత సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ చికిత తానిపర్తితో పాటు సాహిల్ జాదవ్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు.
ఆసియా క్రీడల్లో ఒకేరోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చేసిన ఆర్చరీ క్రీడాకారిణి చికిత రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. పెద్దపల్లికి చెందిన తానిపర్తి చికిత ప్రతిభను గుర్తించి ఆమెను వెన్నంటి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కోచ్‌లను ముఖ్యమంత్రి గారు అభినందించారు.

పేజి 2లో ▶

## నాచారం ఎస్సై పల్లా ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ

37 ఏళ్ల సుదీర్ఘ సేవలో అనేక అవార్డులు, రివార్డులు



2లో

## పేదోళ్ల ఇళ్లను కూల్చడమేనా ప్రజాపాలన?: హరీశ్‌రావు




2లో

## శంషాబాద్‌లో విజయవాడ వెళ్లే విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్



హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ విమానం అత్యవసరంగా ల్యాండైంది. విజయవాడ వెళ్తున్న 591 ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ ఈ విషయాన్ని గుర్తించి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోని ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఈ విమానంలో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. సురక్షితంగా ల్యాండ్ కావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం సాంకేతిక బృందం విమానాన్ని తనిఖీ చేసింది. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో విజయవాడ పంపేందుకు ఏర్పాట్లు చేశారు.

## దొంగతనం నెపంతో దాడి.. వ్యక్తి మృతి



2లో

# సంపాదకీయం

## ఎన్నికల కమిషన్ ఎవరికోసం?

'తుపాకీ పోలీసు చేతిలో ఉన్నప్పటికీ దాన్ని ఎవరిపై పేల్చాలో నిర్ణయించే అధికారం పైవాడి చేతుల్లోనే ఉంటుంది' అని ప్రముఖ నవలాకారుడు జార్జి ఆర్వెల్ తన సుప్రసిద్ధ నవల '1984'లో అన్నారు. ఒక భయంకర ఊహాజనిత ప్రపంచం గురించి చిత్రించిన ఆ నవలలో 'థాట్ పోలీస్' అని ఆర్వెల్ నిర్వచించిన వ్యవస్థలో నిర్ణయాలు అమలు చేసేవారు స్వతంత్రంగా ఆలోచించే శక్తిని కోల్పోతారు. పైవాడు ఏది చెబితే అది చేసే రోబోల్లా మారతారు. మన అధికార వ్యవస్థ ఆ సత్యాన్ని ప్రతిబింబిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో అనేక కీలక నిర్ణయాలు తమకు తెలియకుండా తీసుకున్నారని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు తమ కమిషన్‌లో వివిధ విభాగాలకు పంపిన 14 నోట్స్‌ను సెప్టెంబర్ 24న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లీక్ చేసింది. ఈ సంచలన వార్తా కథనంతో ప్రతిపక్షాలకు, బీజేపీని వ్యతిరేకించే అనేక వర్గాలకు ఎక్కడి లేని ఆవేశం పుట్టుకొచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను దేశద్రోహి అని నిందిస్తూ, ఆయనను ఉరితీయాలని డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా ప్రభవించిన కాక్రోచ్ జనతా పార్టీ కూడా దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది. విచిత్రమేమంటే రెండు రోజుల తర్వాత ఇదే ఎన్నికల కమిషన్ తమ నిర్ణయాలన్నీ కలిసికట్టుగా తీసుకున్నామని ప్రకటించింది. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సమావేశమైన ఫొటోను కూడా పత్రికలకు విడుదల చేశారు.

అయితే ప్రతిపక్షాలు, బీజేపీ వ్యతిరేక వర్గాలు ఎంత గగ్గోలు సృష్టిస్తున్నా కేంద్రంలో కీలకమైన నిర్ణయాలు తీసుకునే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా దాని గురించి అంత సీరియస్‌గా ఉన్నట్లు కనపడడం లేదు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వార్త వచ్చిన సమయానికి మోదీ ఢిల్లీలోని సేవాతీర్థ్‌లో చింతన్ శిబిర్ పేరుతో కేంద్ర కేబినెట్ మంత్రులతో రెండు రోజుల ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. తాము చేపట్టబోయే పాలనా సంస్కరణలు, వికసిత్ భారత్--2047కు రోడ్ మ్యాప్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ఎక్స్‌ప్రెస్ వార్తపై సెప్టెంబర్ 25న ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళనకు ఉపక్రమించాయి. ఆ రోజు దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి అయినందున ప్రధాని మోదీ యువతీ యువకులతో కలిసి భజన్ క్లబ్బింగ్ పేరిట 'అచ్యుతం, కేశవం' 'రాధే రాధే' వంటి భజన గీతాలను ఆలపించారు. స్వయంగా కంజీరా వాయిస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం యూపీ ట్రేడ్ షో, అహ్మదాబాద్‌లో ఎల్ఎన్‌జీ రైలు ప్రారంభం, ఉగ్రవాద నిరోధక సదస్సు తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారే కానీ విపక్షాల ఆందోళన పట్ల ఏ మాత్రం స్పందించలేదు.

తమ మధ్య ఎలాంటి విభేదాలూ లేవని ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ప్రకటించినంత మాత్రాన దేశంలో ఎన్నికల వ్యవస్థ సక్రమంగా నడుస్తుందని బుద్ధిజీవులు ఎవరూ అనుకునే అవకాశాలు లేవు. ఇద్దరు మాజీ ఎన్నికల కమిషనర్లు లావాసా, రావత్ కూడా 'సర్' అమలవుతున్న తీరును తీవ్రంగా విమర్శించారు. సర్ నిర్వహణకు అనుసరిస్తున్న పద్ధతి రాజ్యాంగ వ్యతిరేకమని, లోపభూయిష్ఠమని లావాసా విమర్శిస్తే... ఎన్నికల కమిషన్ పనిచేస్తున్న తీరు సక్రమంగా లేదని, దాని విశ్వసనీయతపై కారుమేఘాలు కమ్ముకున్నాయని రావత్ అభిప్రాయపడ్డారు. నిజానికి వివిధ విభాగాలకు ఇద్దరు ప్రస్తుత కమిషనర్లు పంపిన నోట్స్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రతినిధికి ఎలా చేరాయి? ఒక్కో విభాగం నుంచి నోట్స్ సేకరించడం కష్టమని, ఇద్దరు ఎన్నికల కమిషనర్లలో ఏ ఒక్కరో తమ వద్ద ఉన్న అన్ని నోట్స్‌ను లీక్ చేయడం అసాధ్యమని ఎన్నికల సంఘం అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. ఏమైనప్పటికీ ఈ ముగ్గురు ఎన్నికల కమిషనర్లు చివరకు అంతా క్షేమమే అన్నట్లుగా పత్రికా ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారు. నిజానికి గత మే నుంచి ఆగస్టు వరకు ముఖాముఖి చూసుకుని ఈ ముగ్గురు అధికారులు తమలో తాము సర్దుకుపోయేందుకు ఏ ప్రచ్ఛన్న హస్తం దోహదం చేసిందో ఊహించడం కష్టం కాదు.

మొన్నటి వరకూ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే ఓట్ల చోరీ గురించి గొంతు చించుకుంటూ ఉండేది. అయితే ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నోట్స్ బయటపడ్డాక దేశవ్యాప్తంగా మోదీ వ్యతిరేక శక్తులు వేర్వేరుగా స్పందించడం మొదలుపెట్టాయి. దేశమంతటా యూట్యూబర్లు విస్తృతంగా జ్ఞానేశ్ కుమార్‌ను దుయ్యబట్టడం మొదలుపెట్టారు. ఇంతకూ దేశంలో ఏ వివాదం ఎంతకాలం సాగుతుందో చెప్పలేము. నీట్ పేపర్ లీక్ వివాదం సద్దుమణిగింది. అయోధ్యలోని రామమందిరంలో చందా చోరీ గురించి ఎవరూ మాట్లాడడం లేదు. యూపీఐపై లెవీ చార్జీల గురించి కూడా జరగాల్సినంత చర్చ జరగలేదు. పెట్రోల్‌లో ఇథనాల్ వివాదం ఎప్పుడో తెరమరుగైంది. ఒక వివాదం తర్వాత మరో వివాదం వస్తూ పోతూనే ఉన్నది. పార్లమెంటు సమావేశాలు జరగడం, స్తంభించిపోవడం మామూలయిపోయాయి. ఇప్పుడు ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అక్రమాల గురించి ఎవరైనా ఎంతకాలం మాట్లాడతారో చెప్పడం కష్టం. న్యాయవ్యవస్థ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. అస్మదీయులనే ఎన్నికల కమిషనర్లుగా నియమించే అవకాశం గురించి ఒక న్యాయమూర్తి మాట్లాడితే 'మీరు మాత్రం మీకు నచ్చిన వారిని న్యాయమూర్తులుగా కొలీజియంలో నియమించుకోవడం లేదా?' అని సొలిసిటర్ జనరల్ ప్రశ్నించారు.

గతంలో బోఫోర్స్ కుంభకోణం గురించి ప్రతిపక్షాలు దాదాపు రెండేళ్లు తీవ్రంగా ఉద్యమించి చివరికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం అధికారం కోల్పోయేలా చేశాయి. యూపీఏ పాలనలో అవినీతికి వ్యతిరేకంగా మూడేళ్లకు పైగా ఆందోళనను నిర్వహించి, మోదీ అధికారం చేపట్టే వరకూ బీజేపీ విశ్రమించలేదు. ఎన్నికల కమిషన్ అక్రమంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించడం, జిల్లా, రాష్ట్ర అధికారులకు కేంద్ర డేటాబేస్ అందుబాటులో లేకపోవడం, 16 లక్షల మంది ఓటర్లను తొలగించడం సరైనదంటూ సీఈసీ ఏకపక్షంగా అప్పీళ్లు దాఖలు చేయడం, గోవాలో తొలగించిన ఓటర్లను స్థానిక అధికారులే జాబితాలో చేర్చలేకపోవడం తీవ్రమైన విషయాలే, సందేహం లేదు. అయినా వీటన్నిటిపై ప్రజల్లో ఒక ఉద్వేగపూరితమైన వ్యతిరేకతను నిర్మించకపోతే ప్రతిపక్షాలు చేయగలిగేది ఏమీ లేదు. పెద్ద ఎత్తున ఓటర్లను తొలగించడం వల్లే బెంగాల్, బిహార్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని, ఆ ఎన్నికలను రద్దు చేయాలని వాదిస్తున్న ప్రతిపక్షాలు సదరు రాష్ట్రాల్లో ప్రజాందోళనలను ఎందుకు నిర్వహించలేకపోతున్నాయి? బోఫోర్స్ కుంభకోణం మాదిరి ప్రజల్లో చైతన్యం తేగలిగిన పరిస్థితి ఎన్నికల అక్రమాల విషయంలో రాగలదా?

భారతదేశంలో తమ ఓటు హక్కు గురించి ఎంతమంది పోరాడుతున్నారో చెప్పడం కష్టం. దేశవ్యాప్తంగా కనీసం 3 కోట్ల మంది తమను తాము ఓటర్లుగా నమోదు చేసుకోలేదు. నమోదు చేసుకున్న వారిలో 'సర్' పేరిట ఎన్నికల కమిషన్ తీసేసిన పేర్లను పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 99 కోట్ల మంది ఓటర్లలో 86 కోట్ల

## సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం.. ఫిరంగులమై పేలుదాం: సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి
నేత కార్మికులు, గీత కార్మికులను ఆదుకుంటామన్నారు.. ఏవీ చేయలేదు. వేములవాడ శివయ్య, భద్రాద్రి రామయ్యకు శఠగోపం పెట్టిన వ్యక్తి కేసీఆర్ ఒక్కరే. నేత కార్మికుల కోసం పదేళ్లలో బీఆర్ఎస్ రూ.2,234 కోట్లు ఖర్చు చేస్తే... రెండున్నర సంవత్సరాల ప్రజాపాలనలో రూ.1731 కోట్లు ఇచ్చాం. రెండున్నరేళ్లలో ఈ జిల్లాకు రూ.1700 కోట్ల నిధులు ఇచ్చాం. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల గడీని బద్దలు కొడదాం. సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం.. ఫిరంగులమై పేలుదాం. ఇదే కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిజ్ఞ. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పద్మశాలి బిడ్డను మండలికి పంపాలి. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలి. రేవంత్, మహేశ్ గౌడ్.. జోడీ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను రెండోసారి అధికారంలోకి తీసుకొస్తుంది" అని సీఎం అన్నారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత నౌకాదళ వ్యూహాత్మక పాత్ర మరింత కీలకం

మొదటిపేజీ తరువాయి
భారత నౌకాదళ కమాండర్ల రెండో సదస్సు--2026 న్యూఢిల్లీలోని నౌసేన భవన్‌లో ప్రారంభమైంది. సెప్టెంబర్ 29న ప్రారంభమైన ఈ మూడు రోజుల సదస్సులో నౌకాదళ సీనియర్ అధికారులు, ఆపరేషనల్, ఏరియా కమాండర్లు పాల్గొని కార్యాచరణ సంసిద్ధత, సముద్ర భద్రత, భవిష్యత్ సామర్థ్యాల అభివృద్ధిపై సమగ్రంగా చర్చిస్తున్నారు.

భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రస్తుత సముద్ర భద్రతా పరిస్థితులు, నౌకాదళ కార్యాచరణ స్థితిని సమీక్షించారు. సముద్ర రంగంలో ప్రస్తుతం ఎదురవుతున్న, భవిష్యత్‌లో తలెత్తే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు అత్యున్నత స్థాయి యుద్ధ సంసిద్ధత, చురుకుదనం, వేగవంతమైన ప్రతిస్పందన సామర్థ్యాన్ని కొనసాగించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా అందిపుచ్చుకోవడంతోపాటు నౌకాదళ సామర్థ్యాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.

సదస్సును ఉద్దేశించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ సముద్ర రంగంలో భారత్ బాధ్యతలు వ్యూహాత్మకంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో అత్యవసర పరిస్థితులకు ముందుగా స్పందించే శక్తిగా, విశ్వసనీయ భద్రతా భాగస్వామిగా భారత నౌకాదళం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సముద్ర నిఘా వ్యవస్థలు, విశ్లేషణ సామర్థ్యం, కార్యాచరణ ప్రతిస్పందనను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను ప్రస్తావించిన రాజ్‌నాథ్ సింగ్, భారత నౌకాదళం చేపట్టిన 'ఆపరేషన్ ఊర్జా సురక్ష' దేశ ఇంధన భద్రతను కాపాడటంలో ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. రక్షణ రంగంలో ఆత్మనిర్భరత, స్వదేశీ సామర్థ్యాల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. సురక్షితమైన సముద్రాలు దేశ భద్రతకు, వికసిత భారత్ లక్ష్య సాధనకు అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి మాట్లాడుతూ భారత నౌకాదళం దేశానికి వ్యూహాత్మక శక్తిని పెంచే కీలక దళమని ప్రశంసించారు. సాంకేతిక పరిజ్ఞానం స్వీకరణ, ఆత్మనిర్భరత సాధన, దేశ ఇంధన భద్రత పరిరక్షణకు నౌకాదళం చేస్తున్న నిరంతర కృషిని అభినందించారు.

ఆధునిక యుద్ధ స్వరూపం వేగంగా మారుతోందని, అందుకు అనుగుణంగా సాంకేతిక పరివర్తనను వేగవంతం చేయాలని సీడీఎస్ సూచించారు. సాయుధ దళాల మధ్య నిరంతర సమాచార భాగస్వామ్యం, సమన్వయం, ప్రతికూల పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం పెరగాలని తెలిపారు. త్రివిధ దళాల మధ్య సంయుక్త కార్యాచరణ, సమగ్ర అనుసంధానం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని వివరించారు.

భారత సైన్యాధిపతి జనరల్ ధీరజ్ సేథ్ కూడా నౌకాదళ కమాండర్లతో సమావేశమై ప్రస్తుత భద్రతా పరిస్థితులపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. త్రివిధ దళాల మధ్య సమన్వయం, పరస్పర కార్యాచరణ సామర్థ్యం, నూతన భద్రతా సవాళ్లకు సమగ్ర ప్రతిస్పందనలను మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. సంయుక్త సంసిద్ధతను పెంచేందుకు దళాల మధ్య కార్యాచరణ అనుభవాలు, పాఠాలను నిరంతరం పంచుకోవాలని సమావేశం అభిప్రాయపడింది. మూడు రోజుల సదస్సులో నౌకాదళ కార్యకలాపాలు, యుద్ధ సామగ్రి, రవాణా--సరఫరా వ్యవస్థలు, మానవ వనరులు, శిక్షణ, దళాల అభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంపై విస్తృతంగా చర్చించనున్నారు. దళాల సంఖ్యను సమర్థంగా వినియోగించడం, యుద్ధ సంసిద్ధతను బలోపేతం చేయడం, సామర్థ్యాల అభివృద్ధిని వేగవంతం చేసే చర్యలను కూడా సమీక్షించనున్నారు.

## చికిత తానిపర్తి అభినందనలు తెల్పిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి
ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట అని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, వీబీ --జీ రామ్ జీ అమలును మరింత పటిష్ఠం చేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు

## పేదోళ్ల ఇళ్లను కూల్చడమేనా ప్రజాపాలన?: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: 'పేదోళ్ల ఇళ్లను కూల్చి.. వారి బతుకులను రోడ్డున పడేయడమేనా ప్రజాపాలన' అని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. కొడంగల్ నియోజకవర్గం మద్దూరులో ఇళ్ల కూల్చివేతపై మంగళవారం ఆయన 'ఎక్స్'లో స్పందించారు. "కొడంగల్ బిడ్డను అంటూ కొడంగల్ ప్రజల ఇళ్లనే కూల్చేస్తారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి? మద్దూరులో రాత్రికి రాత్రే పేదల ఇళ్లపైకి బుల్డోజర్లను నడిపించే హక్కు మీకు ఎవరిచ్చారు? కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఇంత కఠినంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు? యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని గొప్పగా చెప్పుకొనే భూసేకరణ చట్టం-2013 ప్రకారం బాధితులకు తక్షణం పరిహారం, పునరావాసం కల్పించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

'20 నెలలుగా 4 వేల మంది స్వీపర్లకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గం. ఇదేనా ఒకటో తారీకున జీతాలు ఇవ్వడం అంటే..' అని ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని ఉద్దేశించి హరీశ్‌రావు 'ఎక్స్'లో మరో పోస్ట్ పెట్టారు.

## నాచారం ఎస్సై పల్లా ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ

మొదటిపేజీ తరువాయి


నాచారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ పల్లా ప్రభాకర్‌రెడ్డి 37 ఏళ్ల సుదీర్ఘ పోలీసు సేవ అనంతరం మంగళవారం పదవీ విరమణ చేశారు.

1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరిన ప్రభాకర్‌రెడ్డి అంకితభావంతో విధులు నిర్వహిస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. 2011లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన ఆయన, 2024లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. గత రెండేళ్లుగా నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా సేవలందించారు.

విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, నిజాయతీ, క్రమశిక్షణకు గుర్తింపుగా ఆయన తన సర్వీసులో 95 నగదు రివార్డులు, ఒక సేవా పతకం, ఒక ఉత్తమ సేవా పతకం, ఆరు ప్రశంసాపత్రాలు, 60 గుడ్ సర్వీస్ ఎంట్రీ రివార్డులు అందుకున్నారు. మాజీ డీజీపీలు పేర్వారం రాములు, సుకుమార్, మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా పలు నగదు రివార్డులు స్వీకరించారు.

ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా నాచారం పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. పోలీసుశాఖకు ఆయన అందించిన సేవలను కొనియాడుతూ భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది పల్లా ప్రభాకర్‌రెడ్డికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం కల్పించడం ఈసీ బాధ్యత:

మొదటిపేజీ తరువాయి
ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు తొలగించడం ఈసీ బాధ్యత అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్‌పై ప్రజల్లో ఉన్న డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు గెలవొచ్చు.. ఓడిపోవచ్చు.. వ్యవస్థపై ప్రజల నమ్మకం ముఖ్యం అని చెప్పారు. తెలంగాణ సంక్షేమ పథకాలను 'ఫ్రీబీస్'గా చూడొద్దు అన్నారు. ?కొచ్చిలో 'ఇండియా టుడే సౌత్ కాన్క్లేవ్'లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగంగా అమలు చేస్తున్నామని, తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించామని వివరించారు. మరో 2 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులో ఉందని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో 53 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మంచి విద్యతో నాణ్యమైన మానవ వనరులను తయారు చేయవచ్చని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు సమాఖ్య స్ఫూర్తితో న్యాయం చేయాలని,రాష్ట్రాలు దేశానికి అందిస్తున్న సహకారాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జీఎస్టీ సమావేశాల్లోనూ దక్షిణాది రాష్ట్రాల అంశాన్ని ప్రస్తావించాని తెలిపారు.

?రాష్ట్రాల మధ్య పోటీ ఆరోగ్యకరమైనదే అని స్పష్టం చేశారు. ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఫైనాన్షియల్ సిటీ, హైటెక్ సిటీ తెలంగాణకు బలం అని చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డితో కలిసి పనిచేసిన అనుభవం ఎప్పటికీ గుర్తుండిపోతుందని డిప్యూటీ సీఎం అన్నారు. వైఎస్ఆర్ మార్గనిర్దేశం కాంగ్రెస్ సిద్ధాంతాలపై నా నమ్మకాన్ని బలపరిచిందన్నారు.

?కాంగ్రెస్‌ను వీడిన పాత నాయకులంతా తిరిగి పార్టీలోకి రావాలని కోరారు.

?దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను వీడిన నాయకులకు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

?తిరిగి కాంగ్రెస్‌లో చేరి దేశాన్ని బలోపేతం చేయడానికి కలిసి పనిచేద్దాం అని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డితో 100 శాతం సఖ్యతతో కలిసి పనిచేస్తున్నామని..తామంతా చర్చించుకుని, ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు.

?రాష్ట్రంలో కాంగ్రెస్ సిద్ధాంతాల అమలే మా లక్ష్యం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## నిమ్స్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌పై సస్పెన్షన్ వేటు

మొదటిపేజీ తరువాయి
అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసులో అరెస్టై కస్టడీలో ఉన్న నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్, అదనపు ప్రొఫెసర్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ సెప్టెంబర్ 28న ఉత్తర్వులు జారీ చేశారు.ఏసీబీ అధికారులు పంపిన రేడియో మెసేజ్‌ల ఆధారంగా డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌ను సెప్టెంబర్ 22న సాయంత్రం 6.30 గంటల నుంచి అరెస్టు చేసి కస్టడీలో ఉంచినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన కస్టడీ 48 గంటలకు మించడంతో తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991 ప్రకారం సస్పెన్షన్‌కు అర్హత ఏర్పడినట్లు నిమ్స్ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ మెమో, ఏసీబీ రేడియో మెసేజ్‌లను పరిశీలించిన అనంతరం డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌ను 2026 సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చేలా సస్పెండ్ చేస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సస్పెన్షన్ కాలంలో నిబంధనల ప్రకారం ఆయనకు జీవన భృతి చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

డాక్టర్ లక్ష్మీ భాస్కర్ సస్పెన్షన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, ఏసీబీ, విజిలెన్స్ కమిషన్ తదితర సంబంధిత అధికారులకు నిమ్స్ అధికారులు పంపించారు. ఉత్తర్వుల ప్రకారం, తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది.

## అరేబియా సముద్రంలో రూ.3 వేల కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం

మొదటిపేజీ తరువాయి
వాటిని తరలిస్తున్న నౌకలోని ఐదుగురు పాకిస్థాన్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు.నిఘా వర్గాల నుంచి అందిన విశ్వసనీయ సమాచారంతో ఐసీజీ బృందాలు సముద్రం, గగనతలం నుంచి అనుమానిత నౌకపై నిఘా పెట్టాయి. దాని కదలికలను నిరంతరం పర్యవేక్షించి సమన్వయంతో వెంబడించాయి. చివరకు అంతర్జాతీయ సముద్ర జలాల్లో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఇరాన్‌కు చెందిన ధౌ పడవను అడ్డుకుని తనిఖీ చేశాయి.అదుపులోకి తీసుకున్న పడవ, సిబ్బంది, స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను సాయుధ భద్రత మధ్య ముంబైకి తరలించారు. నిందితులను వివిధ దర్యాప్తు సంస్థలు సంయుక్తంగా విచారిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తుతోపాటు చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 'నషా ముక్త్ భారత్' సాధనలో ఈ ఆపరేషన్ కీలక విజయమని పేర్కొన్నారు. భారత సముద్ర జలాల్లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాతోపాటు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను అడ్డుకోవడంలో ఏమాత్రం సహించబోమనే ఐసీజీ నిబద్ధతను ఈ చర్య చాటిచెప్పిందని అధికారులు వెల్లడించారు.

## దొంగతనం నెపంతో దాడి.. వ్యక్తి మృతి

మొదటిపేజీ తరువాయి
వెల్దుర్తి: వెల్దుర్తి మండలం మన్నెవారి జలాల్‌పూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం చేశాడనే నెపంతో ఓ వ్యక్తిపై గ్రామస్థులు కర్రలతో దాడి చేసిన ఘటనలో బాధితుడు మృతి చెందాడు.



వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం గ్రామంలో గణేశ్ నిమజ్జనోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గుండేని ప్రవీణ్ అనే వ్యక్తికి చెందిన చరవాణి చోరీకి గురయింది. దీన్నీ బ్యాగరి రామానుజం(40) దొంగలించాడని బాధితుడు ఆరోపించాడు. అర్ధరాత్రి గ్రామంలో గ్రామంలో కనిపించగా.. అతడిపై ప్రవీణ్ కుటుంబ సభ్యులు, ఇతరులు కలిసి దాడి చేశారు. ఈ ఘటనలో రామానుజంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా ప్రవీణ్ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో రామానుజం మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. ఘటనకు సంబంధించి 8 మంది నిందితులు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గుండె ఆరోగ్యం కోసం జీవనశైలిలో మార్పులు

హైదరాబాద్, అక్టోబర్ 01సందేశం టైమ్స్

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే వ్యాధి వచ్చిన తర్వాత జాగ్రత్తలు తీసుకోవడం కంటే ముందుగానే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ఎంతో ముఖ్యం. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, అధిక బరువు, పొగతాగడం, శారీరక శ్రమ లేకపోవడం, నిరంతర ఒత్తిడి వంటి అంశాలు గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. పొగతాగడం, పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానేయడం, ఉప్పు మరియు అధిక నూనెతో కూడిన ఆహారం తగ్గించడం, ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్స్, అధిక చక్కెర కలిగిన పానీయాలను పరిమితం చేయడం మంచిది. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలు, సంపూర్ణ ధాన్యాలు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తగిన మోతాదులో తీసుకోవాలి. డీప్ ఫ్రైడ్ ఫుడ్స్, అధిక సంతృప్త కొవ్వులు, ట్రాన్స్ ఫ్యాట్స్ ఉన్న ఆహారాన్ని తగ్గించాలి.



ఆరోగ్యవంతులైన పెద్దలు సాధారణంగా వారానికి కనీసం 150 నిమిషాల మితమైన శారీరక కార్యకలాపాలు చేయడం ప్రయోజనకరం కాగా, నడక, సైక్లింగ్, ఈత వంటి వ్యాయామాలతో పాటు తగిన బలవర్ధక వ్యాయామాలు కూడా చేయవచ్చు. అధిక బరువు ఉన్నవారు సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామంతో బరువును నియంత్రించుకోవాలి. రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. వైద్యులు సూచించిన మందులను స్వయంగా ఆపడం లేదా మార్చడం చేయకూడదు. తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణ, కుటుంబ సభ్యులతో సమయం గడపడం కూడా ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటాయి. మద్యం తీసుకోని వారు ఆరోగ్యం కోసం ప్రారంభించాల్సిన అవసరం లేదని, తీసుకునేవారు దాని పరిమాణాన్ని తగ్గించే విషయాన్ని వైద్యుడితో చర్చించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఛాతీలో తీవ్రమైన నొప్పి లేదా బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నొప్పి చేతి లేదా దవడకు వ్యాపించడం, అకస్మాత్తుగా చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలి. గుండె ఆరోగ్యానికి ఒక్క మందుపైనే ఆధారపడకుండా ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, పొగాకు దూరం, బరువు నియంత్రణ, రక్తపోటు--కొలెస్ట్రాల్--మధుమేహ నియంత్రణ, తగిన నిద్ర వంటి అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

# గోమాత రక్షణే లక్ష్యంగా 'గో సమ్మాన్ ఆహ్వాన అభియాన్'

హైదరాబాద్, సెప్టెంబర్ 30: సందేశం టైమ్స్ ప్రతినిధి



గోమాతను గౌరవిద్దాం--రక్షిద్దాం, గోవుల రక్షణ మన సంస్కృతి--మన బాధ్యత అనే నినాదాలతో దేశవ్యాప్తంగా గో సంరక్షణను ప్రధాన ధ్యేయంగా 'గో సమ్మాన్ ఆహ్వాన అభియాన్' కార్యక్రమం కొనసాగుతోంది. దేశంలో గోవధను పూర్తిగా నిషేధించాలని, గోవుల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక స్వతంత్ర మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అభియాన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. హైందవ సంస్కృతిలో పూజనీయమైన గోవును భారతదేశ జాతీయ జంతువుగా అధికారికంగా గుర్తించాలని కోరుతున్నారు. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా గోశాలలను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను పకడ్బందీగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అనారోగ్యానికి గురైన లేదా ఆపదలో ఉన్న గోవులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు అన్ని ప్రాంతాల్లో 'గోవాహన' (అంబులెన్స్) సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. గో సంరక్షణ అనేది కేవలం ఒక వర్గానికి లేదా ప్రభుత్వానికి సంబంధించిన విషయం కాదని, సమాజం మొత్తం బాధ్యతగా గుర్తిస్తూ ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అభియాన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు.

# మెదక్ ఖ్యాతిని ప్రపంచస్థాయికి చాటాలి

**క్రీడాకారుల ప్రతిభకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదురాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అండగా ఉంటాప్రముఖ సంఘ సేవకులు గంజి శ్రీనివాస్**

**పతక విజేతలను ఘనంగా సన్మానం**





మెదక్ అక్టోబర్ 01: టసందేశం టైమ్స్ఉః మెదక్ ప్రతినిధి

క్రీడల్లో అద్భుతప్రతిభకనబరిచిరాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను బుధవారం ప్రముఖ సంఘ సేవకులు, వ్యాపారవేత్త గంజి శ్రీనివాస్ గుప్తా కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మెదక్ జిల్లాకు చెందిన విద్యార్థులు క్రీడా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి మెదక్ ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ స్థాయితో పాటు ప్రపంచస్థాయికి చాటాలని ఆకాంక్షించారు.విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం లభిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించగలరని అన్నారు. ఆర్థిక ఇబ్బందులకారణంగా ఏ ప్రతిభావంతుడైన విద్యార్థి క్రీడలకు దూరంకాకూడదనిపేర్కొన్నారు.రాష్ట్ర,జాతీయస్థాయిపోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన మేరకు ఆర్థిక సహాయం, ఇతర సహాయ సహకారాలుఅందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులు కష్టపడి సాధన చేసి మెదక్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.మెదక్ జిల్లాలో క్రీడా ప్రతిభకు కొదవ లేదని, గ్రామీణ ప్రాంతాలనుంచికూడాఎంతోమందిప్రతిభావంతులైన క్రీడాకారులు వస్తున్నారని గంజి శ్రీనివాస్ అన్నారు. వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవసరమైన సహకారం లభిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తాచాటేఅవకాశంఉందన్నారు.మెదక్ విద్యార్థులు పతకాలు సాధించడంగర్వకారణమని ఈ విజయాలు ఇక్కడితో ఆగకూడదన్నారు.రాష్ట్రం, దేశం దాటి ప్రపంచస్థాయిలో మెదక్ పేరు మార్మోగేలా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు.ఐదు బంగారు పతకాలు, రెండు వెండి పతకాలు, ఒక కాంస్య పతకం సాధించి కళాశాల కీర్తిని రాష్ట్రస్థాయిలో ఇనుమడింపజేశారన్నారు. విజేతలను అభినందించిన కళాశాల అధ్యాపక బృందం విజేత లను కళాశాల ఆవరణలో కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఇతర అధ్యాపకులు ఘనంగాసన్మానించారు.విద్యార్థులు ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధించడం అభినందనీయమని అధ్యాపకులుపేర్కొంటున్నారు.విద్యార్థుల విజయాలకు అధ్యాపకులు, క్రీడా విభాగం అందిస్తున్న ప్రోత్సాహం ఎంతోదోహదపడుతోందన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుభాష్ గౌడ్, గేమ్స్ కమిటీ సభ్యులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ హరిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని పతక విజేతలను అభినందించారు.

# మోతే మండలం హుస్నాబాద్ సమీపంలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం..

మోతే, సెప్టెంబర్ 30: సందేశం టైమ్స్ ప్రతినిధి:

మోతే మండలం హుస్నాబాద్ సమీపంలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చీూ 01 దీ 5579 నంబర్ గల మైత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్తుండగా హుస్నాబాద్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా, వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రాథమిక దర్యాప్తులో డ్రైవర్ నిద్రమత్తు, నిర్లక్ష్యం కారణంగానే బస్సు అదుపుతప్పి ప్రమాదానికి గురైనట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# హుజూర్నగర్‌లో డ్రగ్స్, సైబర్ నేరాలపై నిఘా

సందేశం టైమ్స్ సూర్యపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య



హుజూర్నగర్: వార్షిక తనిఖీల్లో భాగంగా డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. యువతలో గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హుజూర్నగర్ పరిధిలోని 11 గ్రామాలకు విలేజ్ పోలీసింగ్ అధికారులను నియమించి, ఆయా గ్రామాల పరిస్థితులపై నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు చెప్పారు.గతంతో పోలిస్తే ప్రాపర్టీ నేరాలు, రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, అయితే సైబర్ క్రైమ్, ఎన్‌డీపీఎస్ కేసులు కొంత పెరుగుతున్నాయని తెలిపారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటామన్నారు...

# భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు..రూ.10 వేల జరిమానా

**శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్**

మెదక్ అక్టోబర్ 01: సందేశం టైమ్స్ఉః మెదక్ ప్రతినిధి :



మెదక్ అదనపు కట్నం కోసం భార్యను వేధించి,చివరకు రాయితో తలపై కొట్టి హత్య చేసిన భర్తకు జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు విధించిందని మెదక్ జిల్లాఎస్పీడి.వి.శ్రీనివాసరావుఐపీఎస్తెలిపారు.శివ ంపేట మండలం కొత్తపేటకు చెందిన బుచ్చ అశోక్‌కు అల్లీపూర్‌కుచెందినమినాతో సుమారుమూడేళ్లక్రితంవివాహమైందివివాహసవ ుయంలో కిలో వెండి, 8 తులాల బంగారం, మోటార్‌సైకిల్‌తో పాటు రూ.50 వేలనగదును కట్నంగాఇచ్చారు.వివాహమైన ఐదు నెలల తర్వాత అశోక్ అదనపు కట్నం కోసంమినానుమానసికంగా శారీరకంగా వేధించడం ప్రారంభించాడు. ఈ విషయంపై పెద్దలసమక్షంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించినప్పటికీ వేధింపులు ఆగలేదు. రూ.లక్ష అదనపు కట్నం కావాలని డిమాండ్ చేస్తూ 22.01.2023న మినాను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు.02.03.2023న ఉదయం 10 గంటల సమయంలో మినా తన తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి భర్త ఇంటికి వెళ్లింది. ఈ సందర్భంగా పంచాయతీ పెట్టి తన పరువు తీస్తోందనే కోపంతో అశోక్ రాయితో ఆమెతలపైబలంగాకొట్టాడు. తీవ్రంగా గాయపడిన మినాను నర్సాపూర్‌లోని పద్మజ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కూకట్‌పల్లిలోని పద్మజ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 05.03.2023న మృతి చెందింది.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రవికాంత్ కేసు నమోదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి, తూప్రాన్ సీఐ శ్రీధర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించికీలకసాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. ప్రస్తుత తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, శివంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు బుచ్చ అశోక్‌కు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్పీ తెలిపారు.ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ ఆనంద్ సహకరించారని తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, పటిష్టమైనసాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన పోలీసు అధికారులు, సిబ్బందినిఎస్పీఅభినందించారు.

# మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం




చౌటకూర్, అక్టోబర్ 01సందేశం టైమ్స్ ప్రతినిధి:

చౌటకూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన చాకలి నాగయ్య కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ పార్కల రాంరెడ్డి పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రామగౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వర్కలా రమేష్, వార్డు సభ్యులు బలరాజ్, చక్రపాణి, దప్పు అశోక్, గంగారాం, తొవ్వల మల్లికార్జున్, కారోబార్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# ఇండియా కూటమికి దూరంగా డీఎంకే.. కాంగ్రెస్‌తో విభేదాలు

న్యూఢిల్లీ అక్టోబర్, 01 సందేశం టైమ్స్ ప్రతినిధి



కాంగ్రెస్‌తో తలెత్తిన విభేదాల నేపథ్యంలో డీఎంకే ఇండియా కూటమి సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 30న కాంగ్రెస్ అధ్యక్షతన న్యూఢిల్లీలో జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి తమ పార్టీ హాజరు కాదని డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇళంగోవన్ తెలిపారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ తమతో ఉన్న సంబంధాలను తెంచుకుని, తమిళగ వెట్రి కజగం (టీవీకే)తో కలిసి కొనసాగాలని నిర్ణయించిందని డీఎంకే ఆరోపించింది. కాంగ్రెస్ తమను కాదని టీవీకేను ఎంచుకోవడం వల్లే కూటమికి దూరంగా ఉండాల్సి వచ్చిందని ఇళంగోవన్ పేర్కొన్నారు. అయితే జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న సిద్ధాంతపరమైన అంశాల్లో తమ వైఖరి కొనసాగుతుందని ఆయన తెలిపారు. సెప్టెంబర్ 30న జరగనున్న ఇండియా కూటమి సమావేశంలో ఎన్నికల సంఘానికి సంబంధించిన అంశాలు, ఎస్ఐఆర్ తదితర అంశాలపై ప్రతిపక్ష పార్టీలు చర్చించనున్నాయి.

# క్రిస్టల్ సదానంద్ పత్తి రకంపై క్షేత్ర ప్రదర్శన

**లిపూత, కాయల ఏర్పాటును పరిశీలించిన పరిసర గ్రామాల రైతులు**

సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్:అక్టోబర్ 01




పొద్దుటూరు, సెప్టెంబర్ 30: తుటికుంట్ల గ్రామానికి చెందిన రైతు తన్నీరు శ్రీనివాసరావు పొలంలో క్రిస్టల్ కంపెనీకి చెందిన 'క్రిస్టల్ సదానంద్' పత్తి విత్తన రకం సాగు చేసిన పంటపై బుధవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. పత్తి పంటలో పూత, కాయల ఏర్పాటుతో పాటు పంట దిగుబడి తీరును రైతులకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఖమ్మం క్రిస్టల్ కంపెనీ టిబీఎం సచిన్ సింగ్ రైతు తన్నీరు శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి, గిఫ్ట్‌ను అందజేశారు. పత్తి పంట ఎదుగుదల, పూత, కాయల ఏర్పాటును పరిశీలించి, పంట సాగు విధానాలపై రైతులకు వివరించారు.కార్యక్రమంలో క్రిస్టల్ కంపెనీ ఫీల్డ్ సిబ్బంది వడ్డెబోయిన కృష్ణ, కరణం తిరుమలరావు, డీలర్ సాహితి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ప్రతినిధి పాపినేని రమేష్ పాల్గొన్నారు. పరిసర గ్రామాలకు చెందిన రైతు సోదరులు అధిక సంఖ్యలో హాజరై క్షేత్ర ప్రదర్శనను వీక్షించారు.

# చింతకాని ఎస్ఐ నరేశ్‌గారికి పాతర్లపాడు అఖిల పక్ష నాయకుల సత్కారం.

సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి:



చింతకాని మండలంలోని 26 గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిసేందుకు ముందస్తు చర్యలు చేపట్టిన పోలీసు శాఖను సీపీఎం,సిపిఐ,తెరాస,బీఎస్పీ నాయకులు అభినందించారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే డీజేల వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించిన చింతకాని ఎస్ఐ జి.నరేశ్ గారిని పాతర్లపాడు లొ వివిధ పార్టీల నాయకులు, పెద్దలు,గ్రామ అధ్యక్షులు, శాలువాతో ఘనంగా సత్కరించారు. డీజేల మోతకు బ్రేక్ వేయడం వల్ల వృద్ధులు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

# సిర్గాపూర్ పోలీస్ స్టేషన్, కంగ్టీ సర్కిల్ కార్యాలయాల వార్షిక తనిఖీ

**రికార్డుల్లో పెండింగ్ లేకుండా చూడాలి.. సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బంది పట్టు సాధించాలి --- ఎస్పీ పరితోష్ పంకజ్**

సంగారెడ్డి, అక్టోబర్ 01 సందేశం టైమ్స్ ప్రతినిధి





సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ బుధవారం సిర్గాపూర్ పోలీస్ స్టేషన్, కంగ్టీ సర్కిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిర్గాపూర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ, నారాయణఖేడ్ డీఎస్పీతో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కేసులకు సంబంధించిన స్వాధీనం చేసుకున్న వాహనాలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకుని, వాటిని కోర్టులో సమర్పించే వరకు జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి పగలు, రాత్రి బీట్ విధుల్లో నిఘా పెంచాలని, దర్యాప్తులో ఉన్న కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. మిస్సింగ్, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దుల నుంచి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాంకేతిక అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి స్థాయిలో పట్టు సాధించి నేరాల నియంత్రణ, దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు. పార్ట్--1 నుంచి పార్ట్--5 వరకు స్టేషన్ రికార్డులను ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్-2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు ఏర్పరచుకుని శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని అన్నారు. సస్పెక్ట్, హిస్టరీ షీటర్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, బీట్ విధుల్లో వారిని తనిఖీ చేస్తూ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. పాపిలాన్ డివైస్‌ను వినియోగిస్తూ అనుమానితులను తనిఖీ చేయడంతో పాటు వేలిముద్రల ద్వారా పాత నేరస్తులను గుర్తించాలని తెలిపారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, ప్రతి పోలీస్ సిబ్బంది అన్ని రకాల విధులపై అవగాహన కలిగి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. అనంతరం కంగ్టీ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించి, దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులు, పెండింగ్‌లో ఉన్న నాన్-గ్రేవ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, సాగుపై కఠినంగా వ్యవహరించాలని, గంజాయి సాగు గుర్తించిన వ్యవసాయ భూములను చట్టపరమైన నిబంధనల మేరకు జప్తు చేసేందుకు సిఫారసు చేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, దాబాలు, పెట్రోల్ బంకుల ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్న ఎస్పీ, అధికారులు, సిబ్బంది పనితీరును అభినందించి విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. ఈ తనిఖీల్లో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, సిర్గాపూర్ ఎస్ఐ మహేష్, సర్కిల్ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా పర్యటన నేపథ్యంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు బ్రహ్మణపల్లిలో అమూల్ పాల కంపెనీ భూమిపూజ కార్యక్రమ ప్రదేశాన్ని పరిశీలించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్

మెదక్ అక్టోబర్ 01: టసందేశం టైమ్స్ఃఊ మెదక్ ప్రతినిధి :





బ్రహ్మణపల్లి వద్ద అమూల్ పాల కంపెనీ భూమిపూజ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షాఅక్టోబర్4నహాజరుకానున్న నేపథ్యంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్బుధవారంకార్యక్రమ ప్రదేశాన్ని పరిశీలించి భద్రతాఏర్పాట్లనుసమీక్షించారు.ఈ సందర్భంగా కార్యక్రమ వేదిక, వీవీఐపీ రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, సభా ప్రాంగణం,పరిసరప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వీవీఐపీ భద్రత,బందోబస్తు ట్రాఫిక్నియంత్రణ,పార్కింగ్,ప్రజలు,వీఐపీల ప్రవేశ నిష్క్రమణ మార్గాలకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తుచర్యలపైపోలీసుఅధికారులతోచర్చించా రు.కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేయాలని ఎస్పీసూచించారు.కార్యక్రమ ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా కొనసాగించాలనిఅనుమానాస్ప ✓ వ్యక్తులు,వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.వీవీఐపీ పర్యటన నేపథ్యంలో విధులు నిర్వహించే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలనుసమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు.భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ జె. నరేందర్ గౌడ్, సీఐలు సందీప్ రెడ్డి, రంగకృష్ణ, ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు గంగా రాజు, సుభాష్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# 37 ఏళ్ల పోలీస్ సేవలకు ఘన వీడ్కోలు

మెదక్, అక్టోబర్ 1: సందేశం టైమ్స్ ప్రతినిధి:






పోలీస్ శాఖలో 37 సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందిన హవేలీఘనపూర్ ఎస్ఐ సత్యనారాయణకు జిల్లా పోలీస్ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. 1989లో ఉమ్మడి మెదక్ జిల్లాకు కానిస్టేబుల్‌గా ఎంపికైన సత్యనారాయణ పోలీస్ శాఖలో అంచెలంచెలుగా ఎదిగి ఎస్ఐగా పదోన్నతి పొందారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో విశేషంగా కృషి చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసి సహచరులు, ప్రజల నుంచి మంచి పేరు సంపాదించారని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు సేవలందించిన సత్యనారాయణ సేవలు అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు కాదని, ఇకపై కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ అనంతరం కూడా పోలీస్ శాఖతో ఉన్న అనుబంధాన్ని కొనసాగించాలని కోరారు. అనంతరం సత్యనారాయణతో పాటు ఆయన సతీమణిని ఎస్పీ శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, సీఐలు జార్జ్, రాజశేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సూక్ష్మ నీటి సేద్యంతో పంట దిగుబడి, రైతుల ఆదాయం పెరుగుతుంది

**డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి: నాబార్డ్ జిల్లా అధికారి క్రిష్ణ తేజ**





**సంగారెడ్డి, అక్టోబర్ 01సందేశం టైమ్స్**
సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ సూక్ష్మ నీటి సేద్యం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పంటల దిగుబడిని, రైతుల ఆదాయాన్ని పెంచుకోవచ్చని నాబార్డ్ జిల్లా అధికారి క్రిష్ణ తేజ అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని రైతులు విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం నాబార్డ్ జిల్లా అధికారి క్రిష్ణ తేజ, జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావుతో కలిసి సంగారెడ్డి జిల్లాలోని చౌటకూరు, కంది, సంగారెడ్డి, సదాశివపేట తదితర మండలాల్లో పర్యటించి, ఉద్యానశాఖ ద్వారా నాబార్డ్ సహకారంతో అమలు చేస్తున్న తెలంగాణ సూక్ష్మ నీటి సేద్య పథకం కింద లబ్ధి పొందిన రైతుల ఆయిల్‌పామ్, చెరుకు తదితర పంట తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తోటల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థల పనితీరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. డ్రిప్ విధానం ద్వారా పంటలకు అందుతున్న ప్రయోజనాలు, నీటి వినియోగం, దిగుబడి, సాగు ఖర్చుల్లో వస్తున్న మార్పుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలకు అవసరమైన నీటిని సమర్థవంతంగా అందించడం వల్ల 20 నుంచి 30 శాతం వరకు అదనపు దిగుబడి పొందుతున్నామని రైతులు తెలిపారు. కూలీల ఖర్చు తగ్గడంతో పాటు సాగు వ్యయం తగ్గి, నికర ఆదాయం పెరుగుతోందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు మాట్లాడుతూ తక్కువ నీటితో పంటలకు అవసరమైన తేమను సమర్థవంతంగా అందించేందుకు సూక్ష్మ నీటి సేద్యం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్, చెరుకు వంటి పంటల్లో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి పొదుపుతో పాటు పంటల ఉత్పాదకత, రైతుల ఆదాయం పెంచుకునే అవకాశం ఉందన్నారు. అర్హులైన రైతులు ప్రభుత్వం అందిస్తున్న సూక్ష్మ నీటి సేద్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు సమత, అనూష రెడ్డి, సునీత, డ్రిప్ ఇంజినీర్ ఉమ, ఫినోలెక్స్, కుమార్ డ్రిప్ కంపెనీల ప్రతినిధులు మహేష్, రాహుల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్‌కు పి. పూజశ్రీ ఎంపిక



**అల్లాదుర్గం అక్టోబర్ 01సందేశం టైమ్స్ ప్రతినిధి**
విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, పార్లమెంటరీ విధానాలు, నాయకత్వ లక్షణాలు, వాక్చాతుర్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించిన జిల్లా స్థాయి మాక్ పార్లమెంట్‌లో పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ జెడ్పీహెచ్ఎస్ ముస్లాపూర్ విద్యార్థిని పి. పూజశ్రీ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్‌కు ఎంపికైంది. జిల్లా స్థాయి కార్యక్రమంలో 31 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని రాష్ట్రపతి, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, మంత్రులు, పార్లమెంట్ సభ్యుల పాత్రలను పోషించారు. సభా నిర్వహణ, ప్రశ్నోత్తరాలు, చర్చలు, బిల్లులపై చర్చ తదితర అంశాలను విద్యార్థులు సమర్థవంతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పి. పూజశ్రీ ఇరిగేషన్ మంత్రిగా తన పాత్రను సమర్థవంతంగా పోషించి విజేతల్లో స్థానం సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పూజశ్రీని అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆంజనేయులు, సంతోష్‌లను ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమానికి మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, డీఈఓ ఎస్. రాజు, ఏఎంఓ సుదర్శన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి తదితర అధికారులు హాజరయ్యారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు మల్లు లక్ష్మి పై దాడిని ఖండించండి

## నేతలపై పోలీసులు జులూమ్ నశించాలి ములకలపల్లి రాములు డిమాండ్

**సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి**



చీఫ్ ఎలక్షన్ కమిషన్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాదులో బుధవారం జరిగిన ర్యాలీ సందర్భంగా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటం మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మిని గోరంగా ఈడ్చుకు వెళ్ళటం ఇలాంటి చర్యలు ప్రజలు ప్రజాతంత్ర వాదులు ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు విజ్ఞప్తి చేశారు శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న నాయకత్వం పైన పోలీసుల ధమనకాండ సరైన కాదని ఆయన అన్నారు బుధవారం పట్టణంలోని జుట్టుకొండ బసవయ్య ఇంటిలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చీఫ్ ఎలక్షన్ కమిషన్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సర్ కార్యక్రమాన్ని వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు హైదరాబాదులో శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న అఖిలపక్ష నాయకులు పైన పోలీసుల జులూన్ సరైంది కాదని ఆయన అన్నారు మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ని మహిళా అని చూడకుండా పోలీసులు ఈడ్చుక వెళ్ళటం దుర్మార్గం చర్యని ఆయన అన్నారు అఖిలపక్ష నేతల్ని అక్రమంగా అరెస్టు చేయటం ఉద్యమాన్ని ఆపలేరు అని ఆయన విమర్శించారు ఈ యొక్క సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమట్ల వెంకటేశ్వరరావు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే సైదా సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ సీనియర్ నాయకులు జుట్టుకొండ బసవయ్య సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం ముత్యాలు తదితరులు పాల్గొన్నారు

# దరఖాస్తులకు ఆహ్వానం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ఖరీఫ్ 2026--27 ధాన్యం కొనుగోలు సీజన్ సందర్భంగా జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో (గ్రాజం) సన్న రకం ధాన్యాన్నిగుర్తించి,ధృవీకరించేందుకు దీ.హెచ్.అగ్రికల్చర్ / అగ్రికల్చర్ లో డిప్లొమా అర్హత కలిగిన



వ్యక్తుల సేవలు 2 నెలల కాలానికి అవసరమున్నవనీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మెదక్ అక్టోబర్ 01: టసందేశం టైమ్స్ఉఊ మెదక్ ప్రతినిధి : ధాన్యం కొనుగోల కేంద్రాల సంఖ్య ,అర్హతను పరిగణనలోకి తీసుకుని, అర్హత కలిగిన వ్యక్తుల సేవలు కొరకు జిల్లా స్థాయి కమిటీ తుది నిర్ణయం తీసుకోబడుతుందన్నారు.ఆసక్తి ,అర్హతకలిగినఅభ్యర్థులుతమవిద్యార్హతలు, అనుభవ వివరాలతో మెదక్ జిల్లావ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించగలరనీ తెలిపారు.

# ఉద్యోగ విరమణ పొందిన తహసిల్దార్లకు ఘన వీడ్కోలు






**ప్రజాసేవలో అందించిన సేవలు, విధి నిర్వహణలో చూపిన నిబద్ధత ప్రశంసనీయం: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, అక్టోబర్ 01సందేశం టైమ్స్**
ఉద్యోగ విరమణ పొందిన నారాయణఖేడ్ తహసిల్దార్ బి. ప్రభులు, చౌటకూర్ తహసిల్దార్ కిష్టయ్యలకు సంగారెడ్డి కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, తహసీల్దార్లు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన బి. ప్రభులు, కిష్టయ్యలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం వారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమైన ప్రక్రియ అని, ఉద్యోగ కాలంలో విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, అంకితభావం, ప్రజాసేవలో అందించిన సేవలే వారి సేవా ప్రస్థానానికి నిజమైన గుర్తింపు అని పేర్కొన్నారు. బి. ప్రభులు, కిష్టయ్యలు తమ బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించారని అభినందించారు. ఉద్యోగ జీవితంలో ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వర్తించిన తహసిల్దార్లు పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, తమకు నచ్చిన వ్యాపకాలతో మానసిక ప్రశాంతతతో కూడిన ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది బి. ప్రభులు, కిష్టయ్యలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేసి, వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.ఎల్. సంగీత, ఆర్. పాండు, తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైకోడ్ పీహెచ్‌సీలో టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



**రాయికోడ్ , అక్టోబర్ 01సందేశం టైమ్స్ ప్రతినిధి**
రాయికోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ రోగులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రోత్సాహంతో పోషకాహార న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీ సూపర్‌వైజర్ నాగరాజు మాట్లాడుతూ టీబీ రోగులు ఆరు నెలలపాటు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. టీబీ రోగులకు ప్రతి నెల రూ. 1,000 చొప్పున పోషక భత్యం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ వ్యాధిని పూర్తిగా నియంత్రించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిఖిల, డీఈఓ పండు, ఫార్మసిస్ట్ సువర్ణ, పీహెచ్ఎన్ నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీలు, సిస్టర్లు, ఇతర వైద్య సిబ్బంది పా

# స్థానిక సంస్థల ఎన్నికల పిటిషన్లపై రేపు ఏపీ హైకోర్టు కీలక తీర్పు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి దాఖలైన మొత్తం ఐదు కీలక పిటిషన్లపై ఏపీ హైకోర్టు రేపు తుది తీర్పును వెలువరించనుంది. ఈ పిటిషన్లలో ప్రధానంగా స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలుపై అభ్యంతరాలు, రిజర్వేషన్ల సవరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన అప్పీళ్లు, అలాగే ఎన్నికలను నిర్ణీత సమయానికే నిర్వహించాలని కోరుతూ వేసిన పిటిషన్లు ఉన్నాయి. వీటికి తోడుగా, సమీప గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ కూడా ఈ ఐదింటిలో ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాలు, ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ పిటిషన్లన్నింటినీ క్రోడీకరించి విచారించిన న్యాయస్థానం ఇచ్చే తీర్పుపైనే తదుపరి ఎన్నికల ప్రక్రియ ఆధారపడి ఉంది, కాబట్టి రేపటి హైకోర్టు తీర్పు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై పూర్తి స్పష్టత రానుంది.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

**మల్లు లక్ష్మిపై దాడిని ఖండించాలి.. నేతలపై పోలీసుల జులుం నశించాలి: ములకలపల్లి రాములు**

**కోదాడ టౌన్, అక్టోబర్ 01సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో పోలీసులు నాయకులను అరెస్టు చేయడాన్ని, మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మిని పోలీసులు ఈడ్చుకెళ్లిన ఘటనను ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు విజ్ఞప్తి చేశారు. బుధవారం కోదాడ పట్టణంలోని జుట్టుకొండ బసవయ్య ఇంట్లో నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన



ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులపై పోలీసుల చర్యలు సరికాదన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ సహా పలు రాజకీయ పక్షాలు ఇటీవల హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులను అరెస్టు చేయడం, మహిళా నాయకురాలైన మల్లు లక్ష్మిని ఈడ్చుకెళ్లడం దుర్మార్గమైన చర్య అని రాములు పేర్కొన్నారు. అరెస్టులు, పోలీసుల నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని ఆయన అన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కును గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే సైదా, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ, సీనియర్ నాయకులు జుట్టుకొండ బసవయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం. ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో అక్టోబర్ 1నుంచిపోలీస్‌యాక్ట్‌అమలు ధర్నాలు,రాస్తారోకోలు, ర్యాలీలకు ముందస్తుఅనుమతి తప్పనిసరిప్రజా ,ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తేకఠిన చర్యలు

**మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్**

**మెదక్ అక్టోబర్ 01: సందేశం టైమ్స్ఈ మెదక్ ప్రతినిధి:**

మెదక్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్--1861లోని 30, 30(ఎ) సెక్షన్లు అమలులో ఉంటాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావుఐపీఎస్ తెలిపారు. ఈ నిబంధనలు అమలులోఉన్నసమయంలోపోలీసుఅధికారులను ంచిముందస్తు అనుమతి లేకుండాధర్నాలు,రాస్తారోకోలు,నిరసనలు, ర్యాలీలు, బహిరంగసభలు,సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల సాధారణ రాకపోకలకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలకు అనుమతి ఉండదన్నారు.అదేవిధంగా ప్రజాల, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం,అశాంతికి కారణమయ్యే చర్యలకు పాల్పడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూసహించబోమనితెలిపారు.నిబంధనలు ఉల్లంఘించిశాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠినచర్యలుతీసుకుంటామని




హెచ్చరించారు.జిల్లాప్రజలు,ప్రజాప్రతినిధులు,వివిధసంఘాలనాయకులుపోలీస్ యాక్ట్ నిబంధనలను పాటిస్తూ శాంతిభద్రతలపరిరక్షణకుపోలీసులకుసహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఆందోల్ నియోజకవర్గంలో ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు





**ఆందోల్, అక్టోబర్ 01 సందేశం టైమ్స్ ప్రతినిధి**

దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆందోల్ నియోజకవర్గంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కులకర్ణి ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చంటి ప్రభు, టౌన్ కార్యదర్శి మేదరి పాపయ్య. జిల్లా బీజేపీ కార్యదర్శి నవాబు గారి భూమయ్య, ఆందోల్ అసెంబ్లీ లీగల్ సెల్ కన్వీనర్ వినోద్, రీఛార్జి కన్వీనర్, ఆందోల్ నియోజకవర్గ ఇంచార్జ్ కన్వీనర్ మటన్ చంద్రశేఖర్ పోచంపేట్ బిజెపి వార్డు నెంబర్ వి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన సేవా కార్యక్రమాలను సమీక్షించి, వాటిని విజయవంతం చేయడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినం

# అబద్ధాలు, విద్వేషాలు, దూషణలతో కాలక్షేపం.. పరిపాలనను గాలికి వదిలేశారు : మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇంచార్జ్ శెట్టి సురేష్**

సిరిసిల్ల సభలో కేసీఆర్, కేటీఆర్ లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అబద్ధాలు, విద్వేషాలు, దూషణలతో కాలక్షేపం చేస్తూ రాష్ట్రంలో పరిపాలనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాలికి వదిలేశారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఆవేశానికి లోనై ఆక్రోశంతో సిరిసిల్ల సభలో కేసీఆర్,



కేటీఆర్‌పై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తూ అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు.బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి గౌరవం, సంస్కారం పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందని కానీ అందుకు భిన్నంగా వ్యక్తిగత విమర్శలు, అసభ్య పదజాలంతో రేవంత్ రెడ్డి మాట్లాడటం బాధ్యతారాహిత్యమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ విమర్శించారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిన సమయంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ, పరిపాలనలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం సిరిసిల్ల సభలో రేవంత్ రెడ్డి చేశారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

# పౌర హక్కుల పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి.

**తాసిల్దార్ దినవల్లి కరుణశ్రీ.**

**సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్:చింతకాని**

చింతకాని మండలం సీతంపేట గ్రామంలోకల్పించారు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల పై అవగాహన సదస్సు నిర్వహించనైనది ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆళ్ల నాగమణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తాసిల్దార్ దినవల్లి కరుణ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కుల పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మీ గ్రామంలో బడిలో గాని దేవాలయాలలో గాని ప్రజలందరూ సమానమని ప్రజల మధ్య భేదాభిప్రాయాలు లేకుండా ఉండాలని కోరారు. గ్రామాల్లో కుల దూషణలు, వివక్ష లేదా సామాజిక సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు అదేవిధంగా వసతి



గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా అందిస్తున్నటువంటి వివిధ పథకాల గురించి మరియు పౌర హక్కుల పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రమేష్, ఆర్ఐ ఏకవీర, శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీనివాస్, ఆశా వర్కర్లు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# వైభవంగా జిల్లా స్థాయి కిసాన్ మేళా-2026..

-రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం మహమ్మద్ అలీ షబ్బీర్

-ఆధునిక వ్యవసాయ పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సందేశం టైమ్స్

కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో జిల్లా స్థాయి కిసాన్ మేళా-2026ను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధానాలపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, రాయితీలు, సాంకేతిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, ప్రభుత్వ పథకాల సమాచారం వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కిసాన్ మేళాలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలు, ప్రభుత్వ పథకాలు, రాయితీలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రదర్శనశాలలో వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన 42 స్టాళ్లను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో రైతులు వీటిని సందర్శించి పంటల సాగు విధానాలు, వ్యవసాయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం,



ప్రభుత్వ పథకాలు, అనుబంధ రంగాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి రాజగౌడ్, సొసైటీ చైర్మన్లు ఇంద్రకరణ్, సుధాకర్, శ్రీనివాస్, అనంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్ రవి తేజ, వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

6

# రైతులు విధిగా ఫార్మర్ ఐడి, క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల

సందేశం టైమ్స్



రైతులు విధిగా ఫార్మర్ ఐడి, క్రాప్ బుకింగ్లు విధిగా చేయించుకోవాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పాల్వంచ సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రైతులకు డిజిటల్ అగ్రి కల్చర్ మిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే గుర్తింపు కార్డుకు విధిగా బుకింగ్ చేయించుకోవాలన్నారు. దీని వలన పి.ఎం. కిసాన్ నిధులు, రైతు భరోసా, పంట నష్టపరిహారం వంటి నగదు బదిలీలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూ॥లు బోనస్ పొందాలంటే పంట సాగు వివరాలు (క్రాప్ బుకింగ్) నమోదు చేయించుకోవాలన్నారు . రైతులు సకాలంలో రుణాలు చెల్లించి 3 శాతం వడ్డీ రాయితీని పొందవచ్చు అని అన్నారు. రైతులు సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు కనగాల నారాయణ రావు, సామా జనార్ధన్ రెడ్డి, చౌగాని పాపారావు, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధుసూధన్ రావు, సి.ఇ.ఒ. జి. లక్ష్మీ నారాయణతదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు నిజాన్ని నిర్భయంగా రాయాలి..

-నైతిక విలువలను కాపాడాలి

-ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేయాలి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సందేశం టైమ్స్

జర్నలిస్టులు సమాజంలో నైతిక విలువలను కాపాడుకుంటూ వాస్తవాలను నిర్భయంగా రాయాలని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలోని వివిధ నియోజకవర్గాలు, మండలాలకు చెందిన జర్నలిస్టులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లాలో సుమారు 500 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రైమ్, సివిల్, రెవెన్యూ తదితర అంశాలపై జర్నలిస్టులు నైపుణ్యం పెంచుకోవడానికి శిక్షణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఏఐ, సోషల్ మీడియా ద్వారా లభించే సమాచారాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలు రాయాలని సూచించారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు నిజాన్ని నిర్భయంగా రాయాలని, పత్రికలు, టీవీ, డిజిటల్ మీడియా ద్వారా ప్రజలకు చేరే వార్తలు వాస్తవాధారంగా, సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వారధులుగా జర్నలిస్టులు పనిచేయాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి సమాచారాన్ని నమ్మకుండా ఫ్యాక్ట్ చెకింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆధునిక సాంకేతికతను వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. రెండు రోజుల శిక్షణలో తొమ్మిది మంది సీనియర్



జర్నలిస్టులు, ఎడిటర్లు వార్తా సేకరణ, వార్తా రచన, నైతిక విలువలు, చట్టపరమైన అంశాలు, డిజిటల్ మీడియా, ఏఐ తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీపీఆర్వో ఎన్.వై. గిరి, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, (టీయూడబ్ల్యూజే)-(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. శిక్షణలో పాల్గొన్న జర్నలిస్టులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# ఘనంగా ఏకలవ్య జెండా ఆవిష్కరణ..

సందేశం టైమ్స్



ఎరుకల కులాన్ని గుర్తించి ఎస్టీ హోదా కల్పించిన సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఏకలవ్య జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం నిజాంపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎరుకల భిక్షపతి హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో ఎరుకల ఆత్మగౌరవ భవనం ఏర్పాటుకు కృషి జరిగిందన్నారు. ఎరుకల కుల వృత్తిలో భాగమైన పందుల పెంపకానికి గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నందున, ప్రభుత్వం ప్రత్యేక స్థలాలు కేటాయించి పందుల షెడ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మండల అధ్యక్షుడు కోనేరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కుర్ర వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి నర్సింలు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కూర ఆకుల లక్ష్మీ, కార్యదర్శి రమేష్, రాజు, రాజేందర్, పోచయ్య, నర్సింలు, సాయి చరణ్, ఎల్లయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల మరమ్మతులకు రూ.10.50 లక్షలు..

-ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సందేశం టైమ్స్



కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బుధవారం సందర్శించారు. కళాశాలలో రూ. 10.50 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి. శ్రీనివాసరావు కళాశాలలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా తాగునీటి సమస్య, అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ, ల్యాబ్ గదుల కొరతను ఆయన వివరించారు. సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే కళాశాలలో జరుగుతున్న విద్యాబోధన, అడ్మిషన్ల పెంపు కోసం అధ్యాపకులు చేస్తున్న కృషిని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేకు వివరించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది విధి నిర్వహణపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు మరింత కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఫొటోలు దిగారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీడీవో రాజిరెడ్డిని సన్మానించిన జర్నలిస్టులు..

సందేశం టైమ్స్



మెదక్ జిల్లా నిజాంపేట మండలంలో గత రెండున్నర సంవత్సరాలుగా ఉత్తమ సేవలందించి బుధవారం పదవీ విరమణ చేసిన ఎంపీడీవో రాజిరెడ్డిని మండల జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ తన విధులను సమర్థవంతంగా నిర్వహించిన రాజిరెడ్డి సేవలను కొనియాడారు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాల సమయంలో ముంపు గ్రామాల ప్రజలకు భరోసా కల్పిస్తూ రాత్రి వేళల్లో సైతం గ్రామాల్లో బస చేసి పరిస్థితులను పర్యవేక్షించారని గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన గొప్ప ఉద్యోగిగా ఆయన సేవలను ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం రాజిరెడ్డి కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని జర్నలిస్టులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బండారి చంద్రయ్య, బండారి సంజీవ్, ఊడెపు శ్రీకాంత్, కూర్మ బాలరాజు, భైరవరెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# చందాపూర్‌లో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే..

సందేశం టైమ్స్



కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం చందాపూర్ గ్రామంలో పలువురు బాధిత కుటుంబాలను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పరామర్శించారు. చందాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయనను ఎమ్మెల్యే మదన్ మోహన్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చందాపూర్ గ్రామ మైనారిటీ సెల్ అధ్యక్షులు నాసిర్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, నాసిర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్‌పై ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పిట్లం పోలీసులు..

**-డయల్ 112కు తక్షణ స్పందన**

సందేశం టైమ్స్
సమస్యతో మనస్తాపానికి గురై వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పిట్లం పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి సురక్షితంగా కాపాడారు. చిన్నకొడబల్లి గ్రామానికి చెందిన గంగారం ఓ సమస్య కారణంగా మనస్తాపానికి గురై వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పిట్లం ఎస్సై ఆంజనేయులు సూచనల మేరకు కానిస్టేబుళ్లు రాజు, మహమ్మద్ నదీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి గంగారంను వాటర్ ట్యాంక్‌పై నుంచి సురక్షితంగా కిందకు దించారు. అనంతరం అతనికి కౌన్సెలింగ్ నిర్వహించి, ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఇబ్బందులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. డయల్ 112కు వచ్చిన సమాచారంపై పోలీసులు తక్షణమే స్పందించి ప్రాణాన్ని కాపాడటంపై స్థానికులు పోలీసులను అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా డయల్ 112కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.



# జిల్లాలో 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు..

**-అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, సభలు నిర్వహించరాదు ఎస్పీ రాజేష్ చంద్ర**

సందేశం టైమ్స్
కామారెడ్డి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్--1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజా ధనానికి నష్టం కలిగించే లేదా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఎవరూ పాల్పడరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. అనుమతి లేకుండా నిషేధిత కార్యక్రమాలు నిర్వహించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# జిల్లా స్థాయి ఎఫ్ ఎల్ ఎన్ సెల్ కు సాలికినేని రాజశేఖర్ ఎంపిక

సందేశం టైమ్స్



పాల్వంచ: పాల్వంచ మండల విద్యాశాఖలో తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి సేవలందించిన సాలికినేని రాజశేఖర్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎఫ్ ఎల్ ఎన్ సెల్ / డీపీఎం యూ లో తెలుగు విషయ నిపుణులుగా విధులు నిర్వహించేందుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ యానంబైలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ప్రకాశరావు , సి ఆర్ పి శెట్టిపల్లి ప్రభాకర్ రాజశేఖర్ కి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. మండల స్థాయిలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిన రాజశేఖర్ , తన ప్రతిభ, అనుభవం మరియు సేవాభావంతో జిల్లా స్థాయిలో కొత్త బాధ్యతలను స్వీకరించున్నారు. జిల్లా స్థాయిలో కూడా తన జ్ఞానం, అనుభవంతో విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు బి. ప్రకాశరావు, సి ఆర్ పి శెట్టిపల్లి ప్రభాకర్ ఆకాంక్షించారు. రాజశేఖర్ నూతన బాధ్యతలు విజయవంతంగా కొనసాగాలని కోరుకుంటూ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# పీఎం సూర్య ఘర్ పథకంపై మూడు రోజుల అవగాహన శిబిరాలు..

**-అక్టోబర్ 1 నుంచి 3 వరకు దరఖాస్తుల నమోదు**

సందేశం టైమ్స్
ప్రధానమంత్రి సూర్య ఘర్-ఉచిత విద్యుత్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు సేవా సేతు అవగాహన, సౌకర్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ విద్యుత్ డివిజన్ కార్యాలయాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పథకం ప్రయోజనాలు, అర్హతలు, దరఖాస్తు విధానం, నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వినియోగదారులు అక్కడే దరఖాస్తులు నమోదు చేసుకునేలా సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులకు సమాచారం విస్తృతంగా చేరేలా పత్రికలు, సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు దండోరా, ప్రజా ప్రకటనల ద్వారా శిబిరాల వివరాలను తెలియజేసి అర్హులను శిబిరాలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. శిబిరాల నిర్వహణ ప్రదేశాలు కామారెడ్డి విద్యుత్ డివిజన్ కార్యాలయం, ఎన్‌పీడీసీఎల్ ఎల్లారెడ్డి విద్యుత్ డివిజన్ కార్యాలయం, ఎన్‌పీడీసీఎల్ బాన్సువాడ విద్యుత్ డివిజన్ కార్యాలయం, ఎన్‌పీడీసీఎల్ టీజీ రెడ్కో జిల్లా మేనేజర్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ (ఆపరేషన్స్) మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరూ ప్రధానమంత్రి సూర్య ఘర్- ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం మార్చి 2027 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. అర్హులు కాలయాపన



చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూడు రోజుల సేవా సేతు శిబిరాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకుని సంబంధిత విద్యుత్ డివిజన్ కార్యాలయాల్లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యతనిస్తున్నాం

**- అనారోగ్యం భారినపడితే నిర్లక్ష్యం చేయొద్దు**
**- కార్మికుల సంక్షేమానికి సమష్టి కృషి**
**- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్**
**- కార్పొరేషన్ కార్యాలయంలో వైద్యశిబిరం విజయవంతం**

సందేశం టైమ్స్
కొత్తగూడెం : కార్మికుల ఆరోగ్య రక్షణకు మున్సిపల్ కార్పొరేషన్ అధిక ప్రాధాన్యతనిస్తుందని, నిరంతరం శ్రమిస్తూ పట్టణ ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది శ్రేయస్సుకు అన్నివేళలా అండగా ఉంటామని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం



కార్పొరేషన్ పరిధిలోని శానిటరీ, వాటర్ సప్లై, విద్యుత్ సరఫరా, ఆఫీస్ సిబ్బంది, ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యం కోసం రేయింబవళ్లు కష్టపడే పారిశుద్ధ్య, నీటి సరఫరా విభాగాల కార్మికులు తమ సొంత ఆరోగ్యం పట్ల కూడా తగిన శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సమయంలో తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశమున్నందున ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్మికుల సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కార్పొరేషన్ యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యంగా ఉండేందుకు ఇలాంటి వైద్య శిబిరాలను కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, సిబ్బంది శిబిరంలో పాల్గొని సుమారు 300 మంది కార్మికులకు రక్తపోటు, మధుమేహం తదితర జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ సుజాత, కార్పొరేషన్, జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అశ్వారావుపేట మండలంలో రూ. 6.5 కోట్ల వ్యయంతో నూతన విద్యుత్ మౌలిక వసతులు

సందేశం టైమ్స్
అశ్వారావుపేట మండల పరిధిలో రూ. 6.5 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ కావాడిగుండ్ల మరియు 33/11 కేవీ తిరుమలకుంట విద్యుత్ ఉపకేంద్రాలను టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్) వి. మోహన్ రావు ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన ఈ విద్యుత్ ఉపకేంద్రాలను టెక్నికల్‌గా ఛార్జ్ చేసి విద్యుత్ సరఫరాకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అదేవిధంగా, అశ్వారావుపేట 220/132/33 కేవీ విద్యుత్ కేంద్రం నుంచి 33/11 కేవీ గంగారం విద్యుత్ ఉపకేంద్రం వరకు సుమారు 5.4 కి.మీ పొడవున నూతనంగా నిర్మించిన 33 కేవీ విద్యుత్ లైన్‌ను కూడా టెక్నికల్‌గా ఛార్జ్ చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నూతన విద్యుత్ ఉపకేంద్రాలు మరియు 33 కేవీ లైన్ అందుబాటులోకి రావడంతో అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం సెక్షన్ పరిధిలోని గ్రామాలు, ముఖ్యంగా గిరిజన గ్రామాలకు, అలాగే రైతులకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడనుంది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి, నాణ్యమైన, స్థిరమైన మరియు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ మౌలిక వసతులు ఎంతగానో దోహదపడనున్నాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో గృహ అవసరాలతో పాటు వ్యవసాయ రంగానికి కూడా మెరుగైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. నూతన ఉపకేంద్రాల ఏర్పాటుతో విద్యుత్ లోడ్‌ను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, భవిష్యత్తులో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కూడా వీలు కలుగుతుంది. ఈ



కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. మహేందర్ , డీఈ (కన్‌స్ట్రక్షన్) బి. వెంకటేశ్వర్లు , డీఈ (ఆపరేషన్) జె. భద్రు పవర్ , ఏడీఈలు బి. వెంకటరత్నం, బి. రాంబాబు, మానస, ఏఈలు కే. వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శ్రీ నరసింహారావు, శ్రీమతి మేఘన తదితరులతో పాటు ఓ ఓ ఎం సిబ్బంది పాల్గొన్నారు. ఇట్లు, బి. వెంకటరత్నం ఏడీఈ / అశ్వారావుపేట

# ఎస్సై అయిలయ్యని ఘనంగా సన్మానించిన మాల మహానాడు నాయకులు

సందేశం టైమ్స్
సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల ఎస్సై అయిలయ్యని మర్యాదక పూర్వకంగా కలిసిన సూర్యాపేట జిల్లా మాల మహానాడు అధ్యక్షులు బొల్లెద్దు వినయ్. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఎస్సైని శాలువలతో ఘనంగాసన్మానించారు. ఈకార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు సల్వాది మల్లయ్య గారు వెన్నమల్ల నరేందర్ బోడ బాలస్వామి గారు సన్మానంలో పాల్గొనడం జరిగింది .

